# మంగళగిరి రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- అమృత్ భారత్‌కు ఎంపిక
- రూ.14.50 కోట్లతో శరవేగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- తూర్పు, పడమర వైపున నూతన ఆర్చీల నిర్మాణం

**మంగళగిరి:** విజయవాడ, గుంటూరు నగరాల రైల్వే స్టేషన్ల మధ్య అమరావతి రాజధానిలో ప్రధాన నగరంగా ఉన్న మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థలో మంగళగిరి రైల్వే స్టేషన్ ఆధునిక రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చెందుతుంది. సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా స్టేషన్‌ను నూతన సొబగులతో తీర్చిదిద్దుతున్నారు. ప్రయాణికులు పెరుగుతుండడంతో అందుకనుగుణంగా రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే శాఖ చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా అమృత్ భారత్ పథకంలో ఎంపికైన స్టేషన్‌కు రూ.14.5 కోట్ల నిధులు మంజూరు కాగా అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.



పడమర వైపు ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ ఆర్చీ

### నూతన ఆర్చీల నిర్మాణాలు..

మంగళగిరి చేనేత పరిశ్రమకు పెట్టింది పేరు. కాగా జాతీయ స్థాయిలో మంగళగిరి చేనేతను తెలియజేసేలా తూర్పు వైపు ద్వారం వద్ద మగ్గం నేస్తున్న మహిళ నమూనా ఏర్పాటు చేశారు. అమరావతి అంటే గుర్తుకు వచ్చేది బుద్ధుడు. దీంతో పడమర వైపు బుద్ధుడు విగ్రహం ఏర్పాటు చేశారు. దీంతో స్టేషన్‌కు రెండు వైపులా నూతనంగా ఆర్చీల నిర్మాణం ఆకట్టుకునేలా స్థూపాలను తీర్చిదిద్దారు. సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసేలా రంగులతో స్టేషన్‌కు అలంకరణ చేశారు. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రయాణికులను ఆకట్టుకునేలా వారికి మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


తూర్పు వైపున ఏర్పాటు చేసిన ఆర్చీ

### సకల సౌకర్యాలతో పనులు..

ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్ వైపు షెడ్డులు నిర్మాణంతో పాటు గ్రానైట్‌తో ఫ్లోరింగ్ వేస్తున్నారు. సాధారణ ప్రయాణికులు, మహిళా ప్రయాణికులు వేచి ఉండేందుకు వేరు వేరుగా వెయిటింగ్ హాల్స్‌ను నిర్మిస్తున్నారు. తాగునీటి సౌకర్యం, టాయిలెట్‌ల నిర్మాణాలను అదనంగా చేపట్టారు. పడమర వైపు టిక్కెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. నాలుగో నంబర్ ఫ్లాట్ ఫామ్ వైపు షెడ్లు విస్తరిస్తున్నారు. ప్రయాణికులు కోచ్‌లను గుర్తించేందుకు వీలుగా కోచ్ ఇండికేషన్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఒకటి, నాలుగు ఫ్లాట్ ఫామ్‌లపై రెండు లిఫ్టలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

### సెక్యూరిటి సిబ్బందిని ఏర్పాటు చేయాలి..

ప్రస్తుతం మంగళగిరి రైల్వే స్టేషన్‌లో 34 రైళ్లు ఆగుతున్నాయి. వీటిలో 20 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 14 ప్యాసింజర్ రైళ్లు ఉన్నాయి. మచిలీపట్నం నుంచి హుబ్లీ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ నుంచి బెంగుళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంగళగిరిలో నిలుపుదల చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. భద్రత దృష్ట్యా ఫ్లాట్‌ఫామ్‌లపై రాత్రి వేళల్లో సెక్యూరిటి సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు టాయిలెట్స్ నిర్వహణకు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

తూర్పు, పడమర ఇరువైపులా ప్రవేశ మార్గాల వద్ద సర్కులేటింగ్ ఏరియాను అభివృద్ధి చేశారు. స్టేషన్ ముఖద్వారం వద్ద ప్యారిస్ లైట్లు ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేశారు.

## క్లుప్తంగా

### బాలికల వసతి గృహం శంకుస్థాపన

**దుగ్గిరాల:** సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ నిర్మాణానికి బుధవారం దుగ్గిరాలలో శంకుస్థాపన నిర్వహించారు. రూ.3.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో రెండంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్, తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్ల ప్రారంభోత్సవం



**ఫిరంగిపురం:** మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడేలా సిమెంటు రోడ్ల నిర్మాణం చేసినట్లు ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు సుమారు రూ.75 లక్షల వ్యయంతో కండ్రిక, ఫిరంగిపురం, వేములూరిపాడు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కె.రామకోటేశ్వరరావు, వై.ప్రకాష్, అప్పయ్య, ఎన్.రవి, బి.సతీష్, కె.శేషు, నాయకులు పాల్గొన్నారు.

### బీసీ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన

**తాడేపల్లి రూరల్:** పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ పాఠశాలలోని బీసీ హాస్టల్‌ను కొత్తగా నిర్మించేందుకు మంత్రి నారా లోకేష్ చొరవ చూపారు. దీంతో రాడికో ఖైతాన్ లిమిటెడ్ సంస్థ ముందుకు రావడంతో పాత బిల్డింగ్‌ను తొలగించి కొత్త బిల్డింగ్ నిర్మాణానికి బుధవారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కొల్లి శేషు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తాడేపల్లి పార్టీ పరిశీలకులు సత్యనారాయణ, పెనుమాక, ఉండవల్లి కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఏపీ ప్రజా నాటక కళాపరిషత్ కార్యాలయం ప్రారంభం



**తాడేపల్లి రూరల్:** ప్రాతూరులోని ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ నూతన కార్యాలయాన్ని ఏపీ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కార్యాలయాన్ని ప్రాతూరులో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ప్రాతూరులో ఆఫీసును ఏర్పాటు చేసిన శ్రీనివాస్, ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులందరినీ కలుపుకొని పనిచేస్తూ నాటక కళను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రాతూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్, కె.ప్రసాదు, పి.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, సాంబశివరావు, హరిబాబు, నరసింహారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

### 14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ బస్ పాసులు

**మంగళగిరి టౌన్:** విద్యార్థులకు ఈనెల 14వ తేదీ నుంచి బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్లు మంగళగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ రెంటపళ్ల పిచ్చయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్‌పాస్ తీసుకునే వారు ముందుగా వారి వివరాలను ఏపీఎస్ఆర్టీసీ బస్‌పాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. 12, 13వ తేదీల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జరుగుతుందని.. దీంతో బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్ పనిచేయదని.. బస్‌పాస్ కావాల్సిన విద్యార్థులు 14వ తేదీ నుంచి బస్‌పాస్ కౌంటర్‌కు రావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి బాలురుపై కేసు

**గుంటూరు రూరల్:** ఇద్దరి బాలురులకు చూసేందుకు నిండా పదిహేనేళ్లు కూడా లేవు. కానీ వాళ్లు చేసే దొంగతనాలు కోకొల్లలు. వివరాల్లోకి వెళితే.. వెంగళాయపాలెం పూలేకాలనీకి చెందిన ఇద్దరు చిన్నారులు మంగళవారం రాత్రి స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలోని చిల్లర దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. బుధవారం తెల్లవారుజామున దుకాణం యజమాని పిలిప్స్ దుకాణం తలుపు తీసి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. షాపులోని సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు బాలురులు సీసీ కెమేరాలను సైతం వెనక్కు తిప్పి దుకాణం పైనుంచి వెళ్లినట్లు తెలిసింది. దీంతో స్థానికులు ఇరువురినీ గుర్తించి వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో బాలురులు గతంలో చేసిన నేరాలను సైతం ఒప్పుకొన్నారు. ఇద్దరూ అన్నదమ్ములని.. వారి వయస్సు ఒకరికి 13.. మరొకరికి 9 ఉంటాయని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు బాలురులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## భవన నిర్మాణాలకు కలెక్టర్ భూమిపూజ

**మంగళగిరి టౌన్:** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.11.50 కోట్ల నిధులతో మంగళగిరి నియోజకవర్గంలో మూడు వసతి గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం మంగళగిరి గణపతి నగర్‌లో నంబూరు వీవీఐటీ ఛారిటబుల్ ట్రస్ట్ రూ.4.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు కొత్తగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను మోడల్ హాస్టల్‌గా తయారు చేయాలనే ఉద్దేశ్యంతో స్థానిక మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని సీఎస్ఆర్ నిధులను సమకూర్చారని తెలిపారు. గణపతి నగర్‌లోని వీవీఐటీ ఛారిటబుల్ ట్రస్ట్ రూ.4.50 కోట్లు, పెనుమాకలో రాడికో ఖైతాన్ లిమిటెడ్ రూ.3.50 కోట్లు, దుగ్గిరాలలో సెల్‌కాన్ సంస్థ రూ.3.50 కోట్లతో హాస్టల్ నిర్మాణానికి ముందుకు వచ్చాయని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి వసతి గృహాలను ప్రారంభించనున్నామని ఆమె పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ కుప్పం రాజశేఖర్, వీవీఐటీ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


గణపతి నగర్‌లో భూమిపూజ చేస్తున్న కలెక్టర్

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు


విద్యుత్ కాంతులలో ఆలయం

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పట్టణ పరిధి గేటు సెంటరులోని వినాయకుడి దేవస్థానంలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని రైతులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. ఏరువాక పౌర్ణమి రాగానే రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని, తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆనవాయితీగా ఏటా అన్నదాతలు అందరూ ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**యర్రబాలెం(మంగళగిరి):** యర్రబాలెంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు బుధవారం కోలాహలంగా నిర్వహించారు. రైతులు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లతో గ్రామోత్సవం నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళ తాళాలు, కనకతప్పెట్లుతో యువకులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రైతన్నలు ట్రాక్టర్లను పూలతో అలంకరించి పుర వీధులలో కోలాట నృత్యాలతో పొలాలకు చేరుకుని వ్యవసాయ పనులను లాంఛనంగా ప్రారంభించారు.


పౌర్ణమి పూజలు నిర్వహిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

## విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఉపేక్షించం

**చేబ్రోలు:** విద్యుత్ సర్వీసుల తనిఖీలు విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగ పర్యవేక్షక ఇంజనీర్ బి.విజయకృష్ణ అన్నారు. చేబ్రోలు సెక్షన్ పరిధిలోని గుండవరం, గొడవర్రు, మంచాల, తోట్లపాలెం, ఉప్పరపాలెం, శేకూరు, శేకూరుపాలెం, వడ్లమూడి గ్రామ పరిధిలోని విద్యుత్ శాఖాధికారుల బృందం బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 62 మంది అధికారులు, 186 మంది సిబ్బంది, 62 మంది బృందాలుగా ఏర్పడి 4,329 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చట్టానికి వ్యతిరేకంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారికి మొత్తంగా రూ.4.22 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. భారత విద్యుత్ చట్టం 135 ప్రకారం పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా.. ఉండాల్సిన మీటరుకు బదులు వేరే మీటరు పెట్టి సీలు వేయకపోయినా ఉపేక్షించమని, అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. తనిఖీలలో డీఈఈ ఎస్.మల్లిఖార్జున ప్రసాద్, డీఈఈ బి.అశోక్ కుమార్, ఏఈలు కె.కోటేశ్వరరావు, యు.శివశంకర్, స్థానిక ఏఈ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో విజయకృష్ణ, కేవీఎల్ఎన్ మూర్తి

## మండలంలో 36.8 మి.మీ. వర్షపాతం

**దుగ్గిరాల:** దుగ్గిరాల మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీచాయి. అధికంగా వర్షం పడడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కాగా మండలంలో 36.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని దుగ్గిరాల తాహసీల్దార్ కార్యాలయం అధికారులు వర్షమాపిని ద్వారా నమోదైన వివరాలను బుధవారం వెల్లడించారు.

## పలువురు అధికారుల బదిలీలు

**పొన్నూరు:** మండల తహసీల్దార్ కార్యాలయంలోని పలువురు అధికారులు బుధవారం బదిలీ అయ్యారు. సీఎస్ డీటీగా పనిచేసిన ఎం.వెంకట్రావు బదిలీపై డివిజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న కార్యాలయం సూపరింటెండెంట్ స్థానంలో గుంటూరు కలెక్టరేట్ డీటీగా పనిచేసిన ఎ.మాధవి రానున్నారు. ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ హసన్ అహ్మద్ మంగళగిరికి బదిలీ అయ్యారు. మున్సిపల్ కార్యాలయం మేనేజరుగా ప్రకాశం జిల్లా చీమకుర్తి మున్సిపాలిటి నుంచి పోతురాజు రానున్నారు. పొన్నూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా సీహెచ్ ఉమా మహేశ్వరీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె నర్సరావుపేట నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీడీపీఓ వెంకట రమణ పల్నాడు జిల్లా క్రోసూరుకు బదిలీ అయ్యారు.

## ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



**గుంటూరు రూరల్:** ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో విద్యా బోధన ఉంటుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంలో గల కళాశాలలో ఢిల్లీకి చెందిన మ్యాన్‌కైండ్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విద్యార్థులకు మెడికల్ రిప్రజెంటేటివ్ విభాగంలో ప్రాంగణ ఎంపిక నిర్వహించారు. ఎంపికల్లో కంపెనీ ఏరియా మేనేజర్ లింగం పవన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరాలను తెలియజేశారు. అన్ని రౌండ్లలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, తదితరులు అభినందించారు.

## డ్వాక్రా రుణాలతో మోసం

**గుంటూరు రూరల్:** తమకు తెలియకుండా తమ పేర్లతో డ్వాక్రా రుణాలను తీసుకుని తమను మోసం చేశారని చౌడవరం గ్రామానికి చెందిన 43 గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తమ గ్రూపులోని సభ్యులకు తెలియకుండా యానిమేటర్లు, సంబంధిత అధికారులు కుమ్మక్కై తమ పేర్లతో రుణాలు పొందారని వాపోయారు. బ్యాంకు నుంచి తమకు నోటీసులు వచ్చే వరకూ రుణాలు పొందినట్లు తమకు తెలియదని ఆరోపించారు. చౌడవరం పరిధిలోని, సమీప గ్రామాలకు చెందిన పలు గ్రూపుల నుంచి సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల రుణాలు అన్యాక్రాంతం జరిగాయని మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మంగళగిరి:** మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం ఇద్దరు యువకులు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై వెళుతూ ఢీకొన్నారు. ఈ ఘటనలో విజయవాడకు చెందిన రాజేష్, పెదకాకానికి చెందిన వెంకట్రావులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు ఇరువురినీ దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు.

**ఆటో ఢీకొనీ ఒకరికి..**

**దుగ్గిరాల:** బైక్ ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. దుగ్గిరాల లాకుల సమీపంలో రేపల్లే వెళుతున్న ఎ.మాణిక్యరావును ట్రక్ ఆటో బుధవారం ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు, చెయ్యి విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. వాహన దారులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై వెంకట రవి తెలిపారు.

## ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా


దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

**తాడేపల్లి రూరల్:** ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు కోర్టు ఇచ్చే తీర్పే దివ్య ఔషధం అని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు 190 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, దానయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, పిచ్చయ్య, గురవయ్య, హగ్గయ్య, ఇమాంబి, సారమ్మ, దుర్గాభవాని, నాగేశ్వరరావు, కార్మిక కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.



### వర్షంతో రహదారులు జలమయం

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం తెల్లవారుజామున భారీగా వర్షం కురిసింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు, వర్షపు నీరు కలిసి రహదారులపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మణిపాల్ అండర్ పాస్ వద్ద వర్షపునీరు, మురుగు ఏకమై పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్లలోకి ప్రవహించాయి. ఉదయం 10 గంటల సమయంలో జాతీయ రహదారి సిబ్బంది భారీగా నిలిచిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా బయటకు మళ్లించారు. పోలకంపాడు, సంజీవయ్య నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో ఆ ప్రాంతంలోని నివాసులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. దీంతో పాటు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయమవ్వడంతో మున్సిపల్ సిబ్బంది మోటర్ల ద్వారా నీటిని బయటకు పంపారు. – తాడేపల్లి రూరల్

## అవకతవకలను విచారించాకే రికవరీ


అవకతవకల ఫైల్‌ను ఏజీఎంకు చూపిస్తున్న ఏపీఎం లాజరు

**ప్రత్తిపాడు:** స్త్రీనిధి రుణాల మంజూరు, చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిగిన తరువాతనే రికవరీ గురించి ఆలోచిస్తామని.. అప్పటి వరకు మేం చేయగలిగింది ఏమీ లేదని వెలుగు ఏపీఎం వి.లాజరు స్త్రీ నిధి ఏజీఎంకు తేల్చి చెప్పారు. ప్రత్తిపాడు వెలుగు కార్యాలయంలో బుధవారం స్త్రీనిధి రుణాల రికవరీపై వీవోఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్త్రీనిధి ఏజీఎం ఎస్.హర్షవర్ధన్ వీవోల వారీగా స్త్రీనిధి రుణాలు, బకాయిలు, చెల్లింపులపై సమీక్ష నిర్వహించారు. అదే సమయంలో ప్రత్తిపాడు వీవోఏను రికవరీపై ఏజీఎం ప్రశ్నించారు. రుణాలు తీసుకున్న వారు వాయిదాలు ఎందుకు చెల్లించడం లేదని.. రికవరీలు లేకుంటే మిగిలిన సభ్యులకు రుణాలు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఏపీఎం లాజరు ప్రత్తిపాడులోని ఓ గ్రామ సంఘంలో ఒక గ్రూపు పేరుతో రూ.4.5 లక్షలు స్త్రీనిధి రుణం తీసుకున్నారని.. కానీ ఆ రుణమొత్తం గ్రూపు సభ్యులకు చేరలేదన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఆధారాలు రికార్డులతో సహా ఉన్నాయన్నారు. స్త్రీనిధి అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేయిస్తానని పీడీ చెప్పారని, విచారణ జరిగే వరకు రికవరీ విషయంలో మేమేమీ చేసేది లేదని స్పష్టం చేశారు. స్పందించిన ఏజీఎం హర్షవర్ధన్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన వీవోఏపై పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయాలని, అదే విధంగా వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్తిపాడు నియోజకవర్గ స్త్రీనిధి మేనేజర్ ఆనంద్, సీసీలు, మండల సమాఖ్య ఓబీలు, వీవోఏలు పాల్గొన్నారు.

## డిజిటల్, స్మార్ట్ విలేజ్‌పై కేంద్ర బృందం పర్యటన


సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు టెలీ కమ్యూనికేషన్ డైరక్టర్ పీవీ ప్రవీణ్, రాధిక

**చేబ్రోలు:** మండలంలోని నారాకోడూరు గ్రామంలో డిజిటల్, స్మార్ట్ విలేజ్ అభివృద్ధిపై బుధవారం కేంద్ర బృందం వివిధ అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసింది. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో కేంద్ర ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ డైరక్టర్ పీవీ ప్రవీణ్, డివిజన్ లెవల్ అధికారి రాధిక మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో సమృద్ధి విలేజ్‌గా ఎంపిక చేసేందుకు గతనెల 22న కేంద్ర బృందం నారాకోడూరులో పర్యటించారు. క్షేత్ర స్థాయిలో మౌళిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలను తెలుసుకున్నారు. డివిజల్ సేవల డిమాండ్ గురించి ప్రజల నుంచి సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆర్ సుబ్బారావు, మండల స్థాయి అధికారులు కె.శ్రీనివాసశర్మ, ఊహారాణి, బి.శ్రీనివాస నాయక్, శ్రీలక్ష్మి, అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

**ప్రత్తిపాడు:** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రత్తిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యంను ప్రత్తిపాడు మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. స్థానిక వేణుగోపాల స్వామి గుడి వద్ద రేషన్ బియ్యంతో ఉన్న వాహనాన్ని మంగళవారం రాత్రి పోలీసులు గుర్తించారు. కానీ పోలీసులు వాహనాన్ని స్టేషనుకు తరలించలేదు. ఏం జరిగిందో ఏమో గానీ.. తిరిగి అర్ధరాత్రి తరువాత వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు రప్పించి కేసు నమోదు చేశారు. ఆటోలో ఇరవై బస్తాల రేషన్ బియ్యం దొరకడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పోలీసులు తొలుత వాహనాన్ని గుర్తించిన సమయంలో ఆటో నిండా రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.